సాక్షి
ఖమ్మం
ఆదివారం । 22 । జనవరి । 2023



రేపటి నుంచి ఐడీఓసీలో గ్రీవెన్స్

ఖమ్మం సహకారనగర్: గ్రీవెన్స్ డేను ఈ సోమవారం(రేపు) నుంచి నూతన కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ గౌతమ్ తెలిపారు.



అట్టహాసంగా 'అటవీ' క్రీడలు

ఎఫ్ఆర్వో శ్రీనివాసరావు స్మారకార్థం ఏర్పాటుచేసిన అటవీ ఉద్యోగుల క్రీడాపోటీలు పాల్వంచలో ప్రారంభమయ్యాయి. 10లో

గరిష్టం / కనిష్టం
32° / 17°

వాతావరణం

ఆదివారం మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రం తర్వాత చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

11నుంచి టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు

ఖమ్మం సహకారనగర్: విద్యాశాఖ ఆధ్వర్యాన టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు వచ్చే నెల 11నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని డీఈఓ సోమశేఖరశర్మ వెల్లడించారు. పరీక్షల నిర్వహణకు ఐదు కేంద్రాలు ఏర్పాటుచేయగా, 874మంది అభ్యర్థులు హాజరుకానున్నారని తెలిపారు. కోర్సుల ఆధారంగా పరీక్ష సమయం ఉంటుందని డీఈఓ పేర్కొన్నారు.

ఓటర్ జాబితాలో 30వేల 'సిమిలర్' ఎంట్రీలు



జాబితాను పరిశీలిస్తున్న ఆర్డీఓ, తదితరులు

ఎర్రుపాలెం: జిల్లా ఓటరు జాబితాలో సిమిలర్ ఫొటో ఎంట్రీలు 30వేల వరకు ఉన్నాయని, మధిర నియోజకవర్గంలో నాలుగు వేల వరకు ఉంటాయని ఖమ్మం ఆర్డీఓ రవీంద్రనాథ్ తెలిపారు. ఈమేరకు జాబితాను క్షేత్రస్థాయిలో విచారిస్తూ ఒకరికి ఒకే చోట ఓటు హక్కు ఉండేలా సరిచేస్తున్నట్లు వెల్లడించారు. మండల కేంద్రంలో పోలింగ్ బూత్‌ల వారీగా ఓటర్ల జాబితా పరిశీలన చేపట్టగా, శనివారం ఆయన తహసీల్దార్ తిరుమలాచారితో కలిసి పరిశీలించారు. ఓటర్ కార్డులకు ఆధార్ నంబర్ అనుసంధానం ప్రక్రియ జిల్లాలో 77 శాతం, మధిర నియోజకవర్గంలో 81 శాతం పూర్తయిందని తెలిపారు. బీఎల్‌ఓలు జాబితా విచారణ త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నర్సరీలను తనిఖీ చేసిన డీఆర్డీఓ



నర్సరీలో పరిశీలిస్తున్న విద్యాచందన

చింతకాని: మండలంలోని వందనం, కొదుమూరు, రాఘవాపురం గ్రామాలలో ఉపాధి హామీ నర్సరీలను డీఆర్డీఓ ఎం.విద్యాచందన శనివారం తనిఖీ చేశారు. మొక్కల పెంపకాన్ని పరిశీలించిన ఆమె మాట్లాడుతూ హరితహారంలో నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ఎక్కడైనా మొక్కలు చనిపోతే కొత్తవి నాటాలని సూచించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

ఈనెల 24 నుండి సదరమ్ క్యాంపులు

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఈనెల 24వ తేదీ నుండి సదరమ్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈనెల 24, 31వ తేదీలతో పాటు ఫిబ్రవరి 7, 14, 21, 28వ తేదీల్లో క్యాంపులు ఉంటాయని పేర్కొన్నారు. ఖమ్మం నగరంతో పాటు జిల్లాలోని అన్ని మండలాలు, మున్సిపాలిటీలకు చెందిన దివ్యాంగులు స్లాట్ బుక్ చేసుకుని హాజరుకావొచ్చని తెలిపారు. క్యాంపునకు వచ్చే సమయాన స్లాట్ బుకింగ్ రశీదు, ఆధార్ కార్డ్ జిరాక్స్, ఒక ఫొటో, ఆస్పత్రి రికార్డులతో హాజరుకావాలని సూచించారు.

జమలాపురం ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలకు హాజరైన భక్తులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రీవారి పాదానికి అర్చకులు శాస్త్రోక్తంగా పంచామృతాలతో అభిషేకాలు చేశాక, స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి వేలాదిగా హాజరైన భక్తుల సమక్షాన నిత్యకల్యాణం జరిపించారు. ఆతర్వాత పల్లకీ సేవ నిర్వహించగా భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఈఓ జగన్మోహన్‌రావు, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మతో పాటు శ్రీనివాస్, విజయకుమారి పాల్గొన్నారు.

పర్వాలేదు.. ఇంకా మెరుగవ్వాలి

- వ్యవసాయ భూముల్లో లైన్ల సమస్య పరిష్కరించండి
- ఏసీడీ చార్జీల విధింపు సరికాదు
- సమస్యలు ఏకరవు పెట్టిన విద్యుత్ వినియోగదారులు
- అన్నీ పరిష్కరిస్తామన్న విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ శ్రీరంగారావు



ముఖాముఖిలో మాట్లాడుతున్న చైర్మన్ శ్రీరంగారావు, పక్కన సభ్యులు

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ సరఫరా బాగానే ఉన్నా... సేవలు మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉందని పలువురు వినియోగదారులు అభిప్రాయం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని డీపీఆర్సీ భవనంలో రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యాన శనివారం వినియోగదారులతో ముఖాముఖి కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. మండలి చైర్మన్ తన్నీరు శ్రీరంగారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సభ్యులు మనోహర్‌రాజు, బండారు కృష్ణయ్య పాల్గొనగా, వినియోగదారులు వెల్లడించిన సమస్యలకు సమాధానాలు ఇచ్చారు. తొలుత ఎస్ఈ ఏ. సురేందర్ జిల్లాలో విద్యుత్ పంపిణీ నిర్వహణ నివేదిక సమర్పించారు. అనంతరం పలువురు వినియోగదారులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక విద్యుత్ పంపిణీ బాగున్నా నిర్వహణ లోపాలు శాపంగా మారాయని వెల్లడించారు. పంటల సాగు సమయాన ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే రవాణా చార్జీలు భరించాల్సి వస్తోందని, పొలాల్లో అనేక చోట్ల లైన్లు ప్రమాదకరంగా మారాయని తెలిపారు. ఈ సమస్యలను పరిష్కరించడంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద మీటర్లు ఏర్పాటు చేసే యోచన విరమించుకోవాలని, పరిశ్రమలు వినియోగంలో లేని సమయాన చార్జీలు పెంచొద్దని, గ్రామాల్లో సరిపడా సిబ్బందిని నియమించాలని, ఏసీడీ చార్జీ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు.

నిర్దేశిత సమయంలో సమస్యల పరిష్కారం

వినియోగదారుల సమస్యలను విన్నాక రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ శ్రీరంగారావు మాట్లాడారు. వినియోగదారుల సమస్యలను నిర్దేశిత సమయంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ట్రాన్స్‌ఫార్మర్ ఫెయిల్ అయితే 48 గంటల్లో మార్చాలని, రైతుల భూముల్లో ఏకపక్షంగా టవర్లు నిర్మించొద్దని సూచించారు. ఒకవేళ వారిని ఒప్పించినా నష్టపరిహారం చెల్లించాలని తెలిపారు. తెలంగాణ ఏర్పాటయ్యాక విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేస్తుండడంతో సాగు పెరిగిందని చెప్పారు. విద్యుత్ వినియోగం పెరిగినందునే ఏసీడీ డిపాజిట్ విధించాల్సి వచ్చిందని, ఈ డిపాజిట్‌పై ఏటా ఏప్రిల్‌లో వడ్డీ జమ చేసి బిల్లులో మినహాయిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సీజీఆర్ఎఫ్ చైర్మన్ పెరుమాండ్ల సత్యనారాయణతో పాటు ఆర్.చరణ్‌దాస్, కె.తిరుమలరావు, ఎస్.నరేందర్, వెంకటేశ్వరరావు, గణపతి పాల్గొన్నారు.

పేదలకు ఉచిత మీటర్లు ఇవ్వాలి..



80 నుంచి 100 గజాల్లో ఇల్లు నిర్మించుకునే పేదలకు ప్రభుత్వం ఇచ్చే పట్టా, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ ఆధారంగా మీటర్లు ఇవ్వాలి. తద్వారా విద్యుత్ చౌర్యం అదుపులోకి వస్తుంది. ఎస్సీ, ఎస్టీ, రజకులు, నాయీబ్రాహ్మణులు ఉచిత విద్యుత్ సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలి.
– పగడాల నాగరాజు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు

ఇంకా ఎవరేం అన్నారంటే...

- వివిధ కారణాలతో మూసేసిన కాలానికి పరిశ్రమలకు విద్యుత్ చార్జీలు జారీ చేయొద్దని పారిశ్రామిక వేత్త కసునూరి నరేందర్ కోరారు.
- వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లకు మీటర్లు బిగించొద్దని, ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే రైతులపై భారం పడకుండా మార్చాలని ఖమ్మం రూరల్ మండలం తెల్దారుపల్లి సర్పంచ్ సిద్దినేని కోటయ్య విన్నవించారు.
- విద్యుత్ సరఫరా బాగున్నప్పటికీ నిర్వహణ లోపాలను సరిచేయాలని డీసీఎంఎస్ చైర్మన్ రాయల శేషగిరిరావు సూచించారు.
- సరిపడా సిబ్బందిని నియమిస్తే సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొన్న సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు... వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లకు మీటర్లు బిగించాలనే యోచన విరమించుకోవాలని కోరారు.
- వ్యవసాయానికి సరిపడా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేయాలని, అన్నిచోట్ల లైన్‌మెన్లను నియమించాలని భారతీయ కిసాన్ సంఘ్ నేత మందనపు రామారావు కోరారు.
- క్రెడాయ్ చైర్మన్ కొప్పు నరేష్‌కుమార్ మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న వెంటనే మీటర్ జారీ చేయడంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్ల స్థాయి పెంపు విషయంలో జాప్యం తొలగించాలని కోరారు.
- ఏసీడీ పేరిట అదనపు భారాన్ని వెనక్కి తీసుకోవాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు, నాయకులతో పాటు న్యూడెమోక్రసీ, సీపీఎం నాయకులు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు.
- రజకులు, నాయీబ్రాహ్మణులకు 250 యూనిట్ల మేర ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్న అధికారులు వేధిస్తున్నారని ఆయా సంఘాల ప్రతినిధులు పంతంగి రవికుమార్, తెనాలి వీరబాబు, గడ్డం ఉపేందర్, కుమ్మరికుంట్ల కైలాష్, బాతరాజు కనకయ్య లింగంపల్లి సైదులు, నర్సింహారావు తదితరులు వివరించారు.



హాజరైన వినియోగదారులు, శాఖ ఉద్యోగులు

స్వయం సహాయక సంఘాల అభివృద్ధికి రూ.వెయ్యి కోట్లు

- 'రూరల్ మార్ట్' ద్వారా ఉపాధి ఉత్పత్తుల కొనుగోళ్లు
- నాబార్డ్ డీజీఎం శ్రీనివాసులు



కళామేళాను ప్రారంభిస్తున్న నాబార్డ్ డీజీఎం శ్రీనివాసులు తదితరులు

ఖమ్మంగాంధీచౌక్: స్వయం సహాయక బృందాల్లోని సభ్యుల ఆర్థికాభివృద్ధికి రూ.వెయ్యి కోట్లు కేటాయించినట్లు నాబార్డ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ బొల్లా శ్రీనివాసులు తెలిపారు. ఖమ్మం టీఎన్జీవోస్ హాల్‌లో శనివారం నాబార్డ్ సహకారంతో జాగృతి సంస్థ ఏర్పాటు చేసిన స్తంభాద్రి గ్రామీణ కళా మేళాను ఆయన ప్రారంభించి మాట్లాడారు. జాగృతి తదితర సంస్థల ద్వారా స్వయం సహాయక సంఘాలకు శిక్షణ ఇప్పిస్తూ వారి అభివృద్ధికి పాటుతున్నామన్నారు. అలాగే, రూరల్ మార్ట్ పథకం ద్వారా స్వయం సహాయ సంఘాల సభ్యులు తయారు చేసే ఉత్పత్తులను కొనుగోళ్లకు చేయూతనిస్తున్నామని తెలిపారు. నాబార్డ్ డీడీఎం సుజిత్‌కుమార్ మాట్లాడుతూ ఎగ్జిబిషన్లు, కళామేళాల్లో వినియోగదారుల అభిరుచులను గుర్తించి ఉత్పత్తులు సిద్ధం చేయాలని సూచించారు. పరిశ్రమల సంస్థ జనరల్ మేనేజర్ అజయ్‌కుమార్, డీఆర్‌డీఏ ఏపీడీఓ జయశ్రీ, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరావు, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి జి.అనసూయ, డీఏఓ ఎం.విజయనిర్మల, డీడబ్ల్యూఓ సీహెచ్.సంధ్యారాణితో పాటు రాజేష్, కొండల్‌రావు, మాధవి, సంధ్య, వెంకటనర్సయ్య, రాజ్‌కుమార్, హలీమా పాషా, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

గోదాం పనుల పరిశీలన

ముదిగొండ: మండలంలోని మేడేపల్లి సహకార సొసైటీ కార్యాలయం ఆవరణలో నిర్మిస్తున్న 200 మెట్రిక్ టన్నుల గోదాం పనులను నాబార్డ్ డీజీఎం శ్రీనివాసులు, డీడీఎం సుజిత్‌కుమార్ శనివారం సాయంత్రం పరిశీలించారు. ఎంపీపీ సామినేని హరిప్రసాద్, సొసైటీ చైర్మన్ సామినేని వెంకటేశ్వరరావు, సర్పంచ్ రమేష్, డీసీసీబీ డీజీఎం ఉపేందర్, ఏజీఎం వెంకటేశ్వర్లు, మేనేజర్ అలేఖ్య పాల్గొన్నారు.

ఇది జేసీబీల బండి!



ఒకటి కాదు రెండు కాదు... వందల సంఖ్యలో జేసీబీలు ఒకేచోట కొలువుదీరాయి! విజయవాడ వైపు నుంచి సికింద్రాబాద్ వైపు మార్గంలో జేసీబీలను తీసుకెళ్తున్న గూడ్స్ రైలు మధిర రైల్వేస్టేషన్‌లో కాసేపు ఆగింది. ఒకేసారి పెద్దసంఖ్యలో జేసీబీలు కనిపించడంతో రైల్వేస్టేషన్‌కు వచ్చిన ప్రయాణికులు, స్థానికులు ఆసక్తిగా తిలకించారు. - మధిర

అవినీతి రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన జిల్లా జడ్జి శ్రీనివాసరావు తదితరులు

ఖమ్మం సహకారనగర్: జిల్లాను అవినీతి రహితంగా తీర్చిదిద్దేందుకు అందరూ కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు సూచించారు. నూతన కలెక్టరేట్‌లో శనివారం వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులకు అవినీతి, వరకట్నం, భ్రూణ హత్యల నివారణపై ఏర్పాటుచేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతిఒక్కరూ నీతి, నిజాయితీతో ఉంటే సమాజం మొత్తం అలాగే తయారవుతుందని తెలిపారు. అవినీతి రహిత సమాజాన్ని నిర్మించాలంటే ముందు అవినీతికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. అలాగే, వరకట్న దురాచారం, భ్రూణ హత్యల నివారణకు అందరూ ప్రతినబూనాలని సూచించారు. కలెక్టర్ వీ.పీ.గౌతమ్ మాట్లాడుతూ విలాసవంతమైన జీవితంలో సౌకర్యం ఉండవచ్చేమో కానీ నీతివంతమైన జీవితంలో సంతృప్తి ఉంటుందని తెలిపారు. బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్న ఉద్యోగులు తప్పు చేస్తే సమాజం సహించదని చెప్పారు. ఈసమావేశంలో అదనపు కలెక్టర్ స్నేహలత, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, న్యాయమూర్తులు ఎన్.సంతోష్ కుమార్, ఎం.ఏ. జావిద్ పాషా, ఆశారాణి, ఆశాలత, మౌనిక తదితరులు పాల్గొన్నారు. కాగా, నూతన కలెక్టరేట్‌కు మొదటిసారి వచ్చిన జిల్లా జడ్జి శ్రీనివాసరావుకు అధికారులు ఘన స్వాగతం పలికారు.

సకాలంలో పరీక్షా కేంద్రానికి చేరుకోండి

- కలెక్టర్ వీ.పీ.గౌతమ్
- నేటి ఏఈఈ పరీక్షకు ఏర్పాట్లుపూర్తి

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్‌సీ) ఆధ్వర్యాన ఆదివారం అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఏఈఈ) పరీక్ష జరగనుండగా, అభ్యర్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఒక ప్రకటనలో సూచించారు. జిల్లాలో 19 పరీక్ష కేంద్రాల్లో 6,664 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. ఉదయం పరీక్షకు 9.45 గంటల వరకు, మధ్యాహ్నం పరీక్షకు 2.15గంటల వరకే కేంద్రాల్లోకి అనుమతిస్తారని వెల్లడించారు. ఇక ఓఎంఆర్ షీట్‌లో లోపాలు లేకుండా బబ్లింగ్ చేయాలని సూచించారు. అలాగే, హాల్‌టికెట్‌పై ఫొటో సక్రమంగా లేకున్నా, సంతకం రాకున్నా గెజిటెడ్ అధికారి ధ్రువీకరించిన మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకెళ్లాలని తెలిపారు. అంతేకాకుండా ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డును అభ్యర్థులు తీసుకెళ్లాలని కలెక్టర్ సూచించారు.

ఏఈఈ అభ్యర్థుల కోసం ప్రత్యేక బస్సులు

ఖమ్మం మామిళ్లగూడెం/సత్తుపల్లి టౌన్: జిల్లా కేంద్రంలో ఆదివారం టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యాన జరగనున్న ఏఈఈ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల కోసం ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నట్లు ఆర్టీసీ ఆర్ఎం ప్రభులత వెల్లడించారు. జిల్లా కేంద్రంలో పది సర్వీసులు ఏర్పాటుచేశామని తెలిపారు. కాల్వొడ్డు, పాత బస్టాండ్, కొత్త బస్టాండ్ ప్రాంతాల నుండి నేరుగా పరీక్ష కేంద్రాల వరకు నడిచే బస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాగా, సత్తుపల్లి బస్టాండ్ నుంచి ఖమ్మంకు ఉదయం 5గంటల నుంచి ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నట్లు డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. అదే విధంగా ఖమ్మం నుంచి సత్తుపల్లికి కూడా బస్సులు ఉంటాయని వెల్లడించారు.

అధికారంలోకి వచ్చేది బీజేపీనే..

రాష్ట్ర సహ ఇన్‌చార్జి అరవింద్ మీనన్



మాట్లాడుతున్న అరవింద్ మీనన్, పక్కన నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ విజయం సాధించి అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ జాతీయ కార్యదర్శి, రాష్ట్ర సహ ఇన్‌చార్జి అరవింద్ మీనన్ ధీమా వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలో శనివారం ఏర్పాటుచేసిన పదాధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న రోజుల్లో పార్టీలో చేరికలు విస్తృతంగా ఉంటాయని, వారితో కలిసి ప్రస్తుత నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో పార్టీకి ఆదరణ పెరుగుతున్న నేపథ్యాన బూత్ స్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రణాళికలు రచించాలని కోరారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి మాట్లాడుతూ ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డితో పాటు నాయకులు సన్నె ఉదయ్‌ప్రతాప్, దేవకి వాసుదేవరావు, సత్యనారాయణ, నంబూరి రామలింగేశ్వరావు, ఉప్పల శారద, రమేష్, విద్యాసాగర్‌రెడ్డి, నున్న రవికుమార్, శ్యాం, రుద్ర ప్రదీప్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ కాదు.. మెడికల్ కాలేజీ!



పాత కలెక్టరేట్ భవనాన్ని గతంలోనే మెడికల్ కాలేజీ కార్యకలాపాలకు కేటాయించారు. తాజాగా నూతన కలెక్టరేట్ ప్రారంభం కావడంతో అక్కడకు అన్ని కార్యాలయాలు తరలివెళ్లగా పూర్తిస్థాయిలో మెడికల్ కాలేజీ ఆధీనంలోకి వచ్చింది. ఈమేరకు శనివారం సాయంత్రం కలెక్టరేట్ కొనసాగిన భవనం బోర్డుపై ప్రభుత్వ వైద్య కళాశాలగా ఫ్లెక్సీ ఏర్పాటుచేశారు. – ఖమ్మం వైద్యవిభాగం

సత్తుపల్లి డిపోకు సంక్రాంతి కళ

ప్రత్యేక సర్వీసులతో రూ.2.32 కోట్ల ఆదాయం

సత్తుపల్లిటౌన్: సంక్రాంతి పండుగ సందర్భంగా ఈనెల 9వ తేదీ నుంచి 20వ తేదీ వరకు సత్తుపల్లి ఆర్టీసీ డిపో ద్వారా నడిపించిన ప్రత్యేక సర్వీసులతో గణనీయమైన ఆదాయం లభించింది. సంక్రాంతికి ప్రజలకు వెళ్లేటప్పుడే కాక తిరుగు ప్రయాణానికి గాను హైదరాబాద్, ఖమ్మం, విజయవాడ, ఏలూరు రూట్లలో ప్రత్యేక సర్వీసులు నడిపించినట్లు డీఎం రాజ్యలక్ష్మి తెలిపారు. ఈమేరకు 94 సర్వీసులను 5,10,519 కి.మీ. నడపటం ద్వారా రూ.2,32,46,849 ఆదాయం వచ్చిందని చెప్పారు. కాగా, 45.54 ఈపీకే, 70శాతం ఓఆర్ నమోదైందని తెలిపారు.

ఖమ్మం డిపోకు రూ.50.08 లక్షలు

ఖమ్మం మామిళ్లగూడెం: సంక్రాంతి పండుగ సందర్భంగా ఖమ్మం నుంచి వివిధ ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు నడిపించారు. ఈనెల 11 నుంచి 19వ తేదీ వరకు హైదరాబాద్‌తోపాటు పలు ప్రాంతాలకు 239 సర్వీసులు నడిపించగా నమోదైన ఆదాయం వివరాలను ఆర్టీసీ అధికారులు శనివారం వెల్లడించారు. ఈమేరకు 11వ తేదీన 21 సర్వీసుల ద్వారా రూ.3.27లక్షలు, 12న, 59సర్వీసుల ద్వారా రూ.9.62లక్షలు, 13న 89 సర్వీసులతో 12.58లక్షలు, 14న 26 సర్వీసులతో రూ.2.74లక్షలు, 16న 71 సర్వీసులతో 8.38లక్షలు, 17న 49బస్సులతో 7.29లక్షలు, 18వ తేదీన 18సర్వీసులు నడిపించగా రూ.3.48లక్షలు, 19న 18 సర్వీసులతో రూ.3.92లక్షల ఆదాయం వచ్చిందని అధికారులు ఓ ప్రకటనలో వెల్లడించారు.



క్లుప్తంగా

జేఈఈ, బీఆర్క్‌కు ఏర్పాట్లు పూర్తి

ఖమ్మం సహకారనగర్: జాతీయ స్థాయిలో ఎన్‌టీఏ ఆధ్వర్యాన నిర్వహించే జేఈఈ మెయిన్స్, బీఆర్క్ మొదటి విడత పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పరీక్షల సిటీ కోఆర్డినేటర్ ఆర్.పార్వతిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌బీఐటీ, కిట్స్, విజయ ఇంజనీరింగ్ కళాశాల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేశామని పేర్కొన్నారు. ఈనెల 24, 25వ తేదీల్లో జేఈఈ మెయిన్స్, 28న బీఆర్క్ పరీక్ష ఉంటుందని తెలిపారు. జేఈఈ మెయిన్స్ పరీక్షలు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, సాయంత్రం 3నుంచి 6గంటల వరకు జరుగుతాయని వెల్లడించారు. ఉదయం 8-30గంటలకు, మధ్యాహ్నం 2-30గంటలకే పరీక్ష కేంద్రాలు గేట్లు మూసివేయనున్నందున అభ్యర్థులు సకాలంలో చేరుకోవాలని సూచించారు.

'317' జీఓ ఉపాధ్యాయులకు పోస్టింగ్

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వం జారీ చేసిన 317 జీఓ ద్వారా ఇతర జిల్లాలకు వెళ్లి తిరిగి ఖమ్మం జిల్లాకు కేటాయించబడిన 21మంది ఉపాధ్యాయులకు పోస్టింగ్ ఇచ్చారు. ఈమేరకు నూతన కలెక్టరేట్‌లోని డీఈఓ కార్యాలయంలో శనివారం కౌన్సెలింగ్ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా డీఈఓ సోమశేఖర్‌శర్మ 21 మంది ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ ద్వారా పోస్టింగ్ కేటాయించారు. కాగా, 21 మంది ఉపాధ్యాయులు 317 జీఓ కారణంగా తమకు అన్యాయం జరిగినదని కోర్టుకు వెళ్లగా కోర్టు ఆదేశాల మేరకు తిరిగి జిల్లాకు కేటాయించారు.

రోడ్డుప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

సత్తుపల్లిరూరల్: మండలంలోని రామానగరం -తాళ్లమడ రహదారిలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. రామానగరానికి చెందిన నేరేటి గణపతి ద్విచక్రవాహనంపై తాళ్లమడ వైపు వెళ్తుండగా బేతుపల్లి చెరువు సమీపాన ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈఘటనలో గణపతి రెండు కాళ్లకు తీవ్ర గాయాలు కాగా సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు.

కోతుల దాడిలో వ్యక్తికి తీవ్రగాయాలు

ఖమ్మంరూరల్: మండలంలోని ఆరెంపులలో కోతి దాడిలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామానికి చెందిన కుమ్మరికుంట్ల బాబు ఇంటి ఆవరణలోకి శనివారం కోతులు రావడంతో తరిమేందుకు యత్నించాడు. ఈక్రమంలో పదుల సంఖ్యలో ఉన్న కోతులు ఆయనపై దాడి చేయగా, తల, నడుముకు తీవ్ర గాయాలవడంతో ఆస్పత్రికి తరలించారు. గ్రామంలో కోతులు బెడద తీవ్రంగా ఉన్నందున అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ఖమ్మంక్రైం: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన నగరంలోని రాపర్తినగర్ బైపాస్ రోడ్డు వద్ద చోటు చేసుకుంది. ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా గుండాల కాలనీకి చెందిన నెర్రిబోయిన ప్రసాద్ (40) శుక్రవారం రాత్రి మిర్చి లోడుతో టాటా ఏస్‌లో ఖమ్మం మార్కెట్‌కు వచ్చాడు. రాపర్తినగర్ వద్ద బైపాస్ రోడ్డులో తెల్లవారుజామున వాహనాన్ని పక్కన ఆపి మార్కెట్ చిరునామా తెలుసుకునేందుకు రోడ్డు దాటుతుండగా కరుణగిరి వైపు నుంచి వేగంగా వచ్చి న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో ప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందాడు. అన్నం ఫౌండేషన్ బాధ్యుల సహకారంతో మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

కులబహిష్కరణ చేసిన పెద్దలపై కేసు

పెనుబల్లి: మండలంలోని మండాలపాడులో కులాంతర వివాహం చేసుకున్న యువతి కుటుంబాన్ని కులపెద్దలు బహిష్కరించగా, బాధ్యులపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండాలపాడుకు చెందిన తడికమల్ల సంపత్, అదే గ్రామానికి చెందిన పెండ్ర జీవిత ఇటీవల కులాంతర వివాహం చేసుకున్నారు. ఇది ఇష్టం లేని జీవిత తరఫు బంధువులు పంచాయతీ నిర్వహించి ఆమె తండ్రి రాంబాబు కుటుంబాన్ని బహిష్కరించారు. ఈమేరకు రాంబాబు వీఎం.బంజరు పోలీసులను ఆశ్రయించగా పంచాయతీ నిర్వహించిన 13 మంది వివిధ గ్రామాల కుల పెద్దలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జి.సూరజ్ తెలిపారు.

బ్యాంకు అధికారి పేరిట మోసం

ఖమ్మంఅర్బన్ : ప్రముఖ బ్యాంకు అధికారి పేరిట వచ్చిన ఫోన్‌ను నమ్మిన వ్యక్తి ఓటీపీ చెప్పడంతో ఖాతా నుంచి రూ.30వేలు స్వాహా అయ్యాయి. ఖమ్మం అర్బన్ పోలీసుల కథనం ప్రకారం.. ఖమ్మం మధురానగర్‌కు చెందిన మహ్మద్ రసూల్‌కు గత నెల 29న బ్యాంక్ అధికారినంటూ ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. క్రెడిట్ లిమిట్ పెంచేందుకు గాను ఫోన్‌కు వచ్చే ఓటీపీ చెప్పాలని సూచించగా రసూల్ నమ్మి చెప్పాడు. అంతలోనే ఖాతా నుంచి రూ.30 వేలు డ్రా అయినట్లుగా మెసేజ్ వచ్చింది. ఈమేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో శనివారం కేసు నమోదు చేసి సైబర్ క్రైం టీంకు సమాచారం ఇచ్చినట్లు సీఐ రామకృష్ణ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,881

కూలిన కలల సౌధం

- బతుకుపోరులో ప్రాణాలు విడిచిన యువకులు
- పెద్దదిక్కు కోల్పోయి కన్నీటి పర్యంతమవుతున్న కుటుంబాలు
- ఇల్లెందు ఆస్పత్రిలో మిన్నంటిన రోదనలు


శివకోటి (ఫైల్)


బైరి రాము (ఫైల్)


ఓదెల కల్యాణ్ (ఫైల్)


అరవింద్ (ఫైల్)

ఇల్లెందురూరల్: వారంతా 20 – 35 ఏళ్ల మధ్య వయసున్న యువకులు.. పనిచేస్తేనే బతుకు బండిని లాగే నిరుపేద కుటుంబాలు.. పొట్టకూటి కోసం ఫొటోగ్రఫీని వృత్తిగా ఎంచుకుని వృత్తిలో ఇప్పుడిప్పుడే రాణిస్తున్నారు. ఇంతలోనే విధి వక్రీకరించి వారి కలల సౌధాన్ని కూల్చివేసింది. రోడ్డు ప్రమాద రూపంలో కుటుంబాలను వీధి పాలు చేసింది. చిన్న వయసులోనే కొడుకులు దూరమైన తల్లిదండ్రులు, భర్తలను కోల్పోయిన యువతుల ఆర్తనాదాలు ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టిస్తున్నాయి. మధుర జ్ఞాపకాలను, తీపి గుర్తులను ఫొటోల రూపంలో అందించే వారు.. ఇక అదే ఫొటోల్లో మాత్రమే కనిపించనున్నారు. ఇల్లెందు మండలం కోటిలింగాల సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన నలుగురిని బలి తీసుకోగా, మరొకరు తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. శనివారం తెల్లవారుజామునే ఆస్పత్రికి చేరుకున్న వారి కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. బాధిత కుటుంబాలను ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ, ఏఎంసీ చైర్మన్ హరిసింగ్, మున్సిపల్ చైర్మన్ డి.వెంకటేశ్వరరావు పరామర్శించగా, ఫొటోగ్రాఫర్ల సంఘం ప్రతినిధులు నల్లబ్యాడ్జీలు ధరించి సంతాపం తెలిపారు.

ఆవిరైన చిన్నమ్మ ఆశలు..

వరంగల్ జిల్లా నర్సంపేట మండలం ద్వారకపేటకు చెందిన ఓదెల కమలాకర్ అలియాస్ కల్యాణ్ (28) చిన్నవయసులోనే తల్లిదండ్రులను కోల్పోయాడు. అదే సమయాన భర్తను కోల్పోయిన కల్యాణ్ చిన్నమ్మ ఓదెల కోమల ఆయనను దత్తత తీసుకుంది. ఇంటర్ వరకు చదువుకున్న కల్యాణ్ ఫొటోగ్రఫీలో మెళకువలు నేర్చుకుని పెళ్లయ్యాక వరంగల్‌కు మకాం మార్చాడు. భార్య, కూతురు, చిన్నమ్మతో కలిసి సంతోషంగా ఉంటున్న సమయంలో రోడ్డు ప్రమాదం ఆయనను బలితీసుకుంది. దీంతో పెద్దదిక్కు కోల్పోయిన చిన్నమ్మ కోమల, భర్త దూరమైన మౌనిక, తండ్రికి ఏమైందో తెలియక చిన్నారి అంజిత రోదిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది.

ప్రేమించి పెళ్లి చేసుకున్న నెలకే..

హనుమకొండ జిల్లా కమలాపూర్‌కు చెందిన బోళ్లత్తిని అరవింద్ (21) ఇంటర్ వరకు చదువుకున్నాడు. ప్రేమించిన యువతిని పెద్దల అంగీకారంతో గత డిసెంబర్ 17న పెళ్లి చేసుకున్నాడు. జీవితంలో స్థిరపడాలనే ఆకాంక్షతో ఫొటోగ్రఫీ నేర్చుకోవాలని భావించి, మిత్రులతో కలిసి ఫొటోషూట్‌కు వెళ్తుండగా రోడ్డు ప్రమాదం మింగేసింది. ఒక్కగానొక్క కుమారుడిని గారాబంగా పెంచామని, కోరుకున్న యువతితో పెళ్లి చేయగా.. ఇంతలోనే ఈ ఘోరం జరిగిందని తల్లిదండ్రులు విలపిస్తున్న తీరు కలచివేసింది. ఇక వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన కొంపెల్లి శివకోటి (31)కి ఎనిమిదేళ్ల కిందట వివాహం జరగగా, భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఫొటోగ్రఫీలో మెరుగైన జీవనం కోసం వరంగల్‌కు మకాం మార్చాడు. అద్దె ఇంట్లో ఉంటున్న ఆయన ఫొటోగ్రఫీలో గత జాతీయస్థాయి అవార్డు అందుకున్నాడు. వెడ్డింగ్ షూట్ కోసం బయలుదేరి రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోగా భార్య, పిల్లలు దిక్కులేని వారయ్యారు. మృతుల్లో మరో వ్యక్తి హనుమకొండ జిల్లా కమలాపురం గ్రామానికి చెందిన బైరి రాము (32) కూడా ఫొటోగ్రఫీలో మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. పదిహేనేళ్లుగా ఇదే రంగంలో జీవనం సాగిస్తున్న ఆయనకు భార్య రజిని, పాప, బాబు ఉండగా కుటుంబంతో సహా వరంగల్‌లో ఉంటున్నాడు. ఉన్నంతలో జీవనం సాఫీగా సాగుతున్న సమయాన రోడ్డు ప్రమాదం ఆ కుటుంబాన్ని ఛిద్రం చేసింది.

హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ..

వరంగల్ జిల్లా నర్సంపేట మండలం ద్వారకపేటకు అబ్బునాపురం క్రాంతి (22) తన స్నేహితుడైన కల్యాణ్‌తో కలిసి ఫొటోగ్రఫీ నేర్చుకోవాలని భావించాడు. వృత్తిలో మెళకువలు నేర్చుకునేందుకు శుక్రవారం మిత్రుడితో కలిసి ఫొటోషూట్‌కు వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఆయనను శనివారం ఉదయం ఖమ్మం ఆస్పత్రి నుంచి హైదరాబాద్ ఆస్పత్రికి తరలించారు.


మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ


భార్యను ఓదారుస్తున్న మృతుడు అరవింద్ తండ్రి శ్రీనివాస్


రోదిస్తున్న కల్యాణ్ కుటుంబసభ్యులు


మృతదేహాల వద్ద నివాళులర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు

రూ.10కోట్ల ప్రకటనపై కల్లూరులో సంబరాలు

కల్లూరు: ఇటీవల ఖమ్మంలో జరిగిన సభలో మేజర్ గ్రామపంచాయతీలకు రూ.10 కోట్ల చొప్పున నిధులు విడుదల చేయనున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఈమేరకు కల్లూరులో శనివారం సర్పంచ్ లక్కినేని నీరజ ఆధ్వర్యాన సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం, పుష్పాభిషేకం నిర్వహించి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఖమ్మం జిల్లాలోనే మేజర్ గ్రామపంచాయితీలకు నిధులు విడుదల చేయనున్నట్లు ప్రకటించడం హర్షణీయమని తెలిపారు. కల్లూరు పంచాయితీకి రూ.10 కోట్లు మంజూరు చేయాలని తన వినతితో సీఎం సానుకూలంగా స్పందించారని చెప్పారు. గడిచిన ఇరవై రోజుల్లో మండలానికి రూ.65 కోట్ల మేర నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఈనిధులతో ప్రభుత్వాస్పత్రి భవనం, మినీ స్టేడియంతో పాటు బీటీ, సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాళ్లు నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ బీరవల్లి రఘు, జెడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, రైతు సమితి మండల కన్వీనర్ డాక్టర్ లక్కినేని రఘుతో పాటు పసుమర్తి చందర్‌రావు, పాలెపు రామారావు, బోబోలు లక్ష్మణరావు, ఎం.డీ.ఇస్మాయిల్, ఎస్.కే.కమ్లి, కాటమనేని వెంకటేశ్వరరావు, మేకల కృష్ణ, పసుమర్తి రాంబాబు, చారుగుండ్ల అచ్యుతరావు, పెడకంటి రామకృష్ణ, కొరకొప్పు ప్రసాద్, ఉబ్బన వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.


సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న సర్పంచ్ నీరజ, పక్కన ఎమ్మెల్యే సండ్ర తదితరులు

ప్రతీ విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదగాలి

రఘునాథపాలెం: భద్రత, అవకాశాలను ఇచ్చి అందరూ ఎదిగేలా తోడ్పడిన సమాజానికి తిరిగి ఎంతో కొంత ఇచ్చేలా విద్యార్థులు ఎదగాలని అదనపు కలెక్టర్ స్నేహలత సూచించారు. మండలంలోని కోయచలక ఉన్నత పాఠశాలలో శనివారం ఏరాపటుచేసిన తల్లిదండ్రుల సమావేశంలో ఆమె పాల్గొన్నారు. తొలుత పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి వారి భవిష్యత్ లక్ష్యాలను తెలుసుకున్నారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మాత్రమే సమాజాన్ని మార్చగలిగే శక్తి ఉంటుందని.. వారి సూచనలు పాటిస్తే విద్యార్థులు అన్నిరంగాల్లో ఎదగొచ్చని తెలిపారు. ఆతర్వాత ప్రాథమిక పాఠశాల విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను ఆమె పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. హెచ్‌ఎం అనిత, సర్పంచ్ మాధంశెట్టి హరిప్రసాద్, ఎంఈఓ ఎం.శ్రీనివాస్, ఎంపీడీఓ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ స్నేహలత

పకడ్బందీగా కంటివెలుగు శిబిరాలు

ఖమ్మం సహకారనగర్: కంటి వెలుగు శిబిరాలను పకడ్బందీగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు. హైదరాబాద్ నుంచి వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి రిజ్వీ, కమిషనర్ శ్వేతామహంతితో కలిసి సీఎస్ కలెక్టర్లతో వీసీ ద్వారా సమీక్షించారు. బఫర్ బృందాలను ఉపయోగిస్తూ ఒకేచోట సమూహంగా ఉండే వారి కోసం ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ జిల్లాలో 55 బృందాలను ఏర్పాటుచేసి శుక్రవారం నాటికి 13,673 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 4,270 మందికి అద్దాలు ఇచ్చామని తెలిపారు. వీసీలో అదనపు కలెక్టర్ స్నేహలత, డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాలతి, జెడ్పీ సీఈఓ వీ.వీ.అప్పారావు పాల్గొన్నారు.

పార్శిళ్లు తీసుకెళ్లండి..

ఖమ్మంమామిళ్లగూడెం: ఖమ్మం కొత్త బస్టాండ్‌లోని లాజిస్టిక్స్ పాయింట్ వద్ద ఏడాది కాలంగా పేరుకుపోయిన పార్శిళ్లను సంబంధీకులు తీసుకెళ్లాలని అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్(లాజిస్టిక్స్) ఎం.వేణుగోపాల్ సూచించారు. ఏడాది కాలంగా కొన్ని పార్శిళ్లు మిగిలిపోయాయని, వీటిని ఏడు రోజుల్లోగా తగిన ఆధారాలు చూపించి తీసుకెళ్లాలని తెలిపారు. లేనిపక్షంలో తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు.

కిమ్స్‌లో అరుదైన శస్త్రచికిత్స

ఖమ్మం వైద్యవిభాగం: నగరంలోని కిమ్స్ ఆస్పత్రి అరుదైన శస్త్రచికిత్స నిర్వహించిన వైద్యులు విద్యార్థిని ప్రాణాలు నిలిపారు. నేలకొండపల్లికి చెందిన చైతన్య(18) ఖమ్మంలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుండగా, ఇటీవల భవనం పైనుండి పడడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లింది. ఈమేరకు కిమ్స్ ఆస్పత్రిలో చేర్పించగా పరీక్షించిన వైద్యులు ఆమె మెదడు బయటకు రావటం, రక్తం గడ్డకట్టడాన్ని గుర్తించి మెదడుకు శస్త్రచికిత్స నిర్వహించారు. రెండు వారాల పర్యవేక్షణ అనంతరం కోలుకున్న ఆమెను శనివారం డిశ్చార్జ్ చేశారు. ఈసందర్భంగా వైద్యుడు జి.సురేష్, యాజమాన్యం పొంగులేటి ప్రసాద్‌రెడ్డి, చావ శివరామక్రిష్ణ, బాబిరెడ్డికి విద్యార్థిని చైతన్య తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.


విద్యార్థితో తల్లిదండ్రులు, వైద్యుడు సురేష్

ఏఈఓల ఫోరం కార్యవర్గం ఎన్నిక

ఖమ్మం సహకారనగర్: టీఎన్జీవోస్ అనుబంధ ఏఈఓ(అగ్రికల్చర్ ఎక్సటెన్షన్ ఆఫీసర్స్) ఫోరం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నా రు. ఈ మేరకు కమిటీ వివరాలను ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన సందీప్, భాగం పవన్ వెల్లడించారు. ఏఈఓ ఫోరం జిల్లా జిల్లా అధ్యక్షుడిగా షేక్ నాగుల్‌మీరా, కార్యదర్శిగా బి.శ్రీకాంత్, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎం.వెంకటేశ్వర్లు, మహిళా విభాగం అధ్యక్షురాలిగా ఎం.డీ.ఆఫ్రిన్, సంయుక్త కార్యదర్శులుగా దీపక్‌రెడ్డి, సైదులు, మహిళా సంయుక్త కార్యదర్శి గా కె.ప్రతిభ, కోశాధికారిగా బి.మహీం ఎన్నికయ్యా రు. అలాగే, ప్రచార కార్యదర్శిగా యు.హర్షవర్ధన్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా యు.శివకష్ణ, కార్యవర్గ సభ్యులుగా ఏ.వాసంతి, కె.శ్రీకాంత్, వై.బాలకృష్ణ, ఎం.శ్రీకావ్యను ఎన్నుకోగా కార్యవర్గాన్ని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అఫ్జల్‌హసన్, ఆర్‌వీఎస్.సాగర్ తదితరులు అభినందించారు.


కార్యవర్గాన్ని అభినందిస్తున్న టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు అఫ్జల్

బహిరంగ ప్రకటన

East: N.S.P.Land; West: Proposed Tourism Department Budget Hotel; North: Bypass Road; South: N.S.P Land.
పాటిబండ్ల శరత్
బి. వాసవి కుమారి, న్యాయవాదులు
ఖమ్మం, సెల్: 9700634748

జల పుష్పాల జాతర!

మధిర: మధిర పెద్ద చెరువులో శనివారం నుంచి చేపల వేట ప్రారంభమైంది. ఈ విషయమై చుట్టుపక్కల గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం జరగడంతో ప్రజలు పెద్దసంఖ్యలో వచ్చారు. మత్స్య సహకార సంఘం ఆధ్వర్యాన రాజమండ్రి నుంచి పిలిపించిన మత్స్యకారులతో చేపల వేట చేపట్టారు. ఒక్కో చేప కేజీ మొదలు 15కేజీల వరకు బరువుతో ఉండగా, అక్కడికక్కడే కేజీ రూ.120 చొప్పున విక్రయించగా పలువురు కొనుగోలు చేశారు. అలాగే, చేపలను శుభ్రం చేసేందుకు పలువురు చేరుకోవడంతో చెరువు పరిసరాలు రద్దీగా కనిపించాయి.


చేపలు శుభ్రం చేయించేందుకు బారులుదీరిన ప్రజలు


విక్రయానికి సిద్ధంగా ఉన్న చేపలు

రేపు 'పొంగులేటి' ఆత్మీయ సమ్మేళనం

ఇల్లెందు: ఇల్లెందులోని లలితాపురం మామిడి తోటలో ఈనెల 23వ తేదీన మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యాన ఆత్మీయ సమ్మేళనం నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈమేరకు ఏర్పాట్లను శనివారం జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబుతో పాటు తుళ్లూరి బ్రహ్మయ్య తదితరులు పరిశీలించారు. కాగా, సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఎంపీటీసీలు, నాయకులు పూనెం సురేందర్, మండల రాము, కృష్ణప్రసాద్, తాటి రాంబాబు, సూర్నబాక సత్యనారాయణ, ధనుంజయ్, తాటి భిక్షం, ఎస్.నర్సింహారావు, నాగార్జున, ముక్తి కృష్ణ కోరారు. జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు.


ఏర్పాట్లు పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్ కనకయ్య, విజయ్‌బాబు తదితరులు

మద్యం మత్తులో పొట్టపై కోసుకున్న యువకుడు

కారేపల్లి: మద్యం మత్తులో ఓ యువకుడు పొట్టభాగంపై బ్లేడుతో కోసుకున్న ఘటన శనివారం కారేపల్లిలో చోటు చేసుకుంది. స్థానిక పోస్టాఫీస్ రోడ్డులో నివాసం ఉంటున్న ఐతబోయిన సంపత్ వాటర్‌క్యాన్లువేస్తూ జీవనం గడుపుతున్నాడు. ఆయన మేనమామ ఇంట్లో శుభకార్యానికి పిలవలేదనే కారణంతో శనివారం అతిగా మద్యం సేవించి బంధువులను తిట్టసాగాడు. ఎంతచెప్పినా వినకపోవడంతో కుటుంబసభ్యులు కారేపల్లి పోలీసులకు సమాచారం ఇవ్వగా, మరింత ఆగ్రహంతో ఆయన బ్లేడ్‌తో పొట్టపై కోసుకోగా గాయాలయ్యాయి. దీంతో ఆయనకు కారేపల్లి పీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స చేయించాక ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

శ్రీ సిటి ప్రైడ్ (pride)
- DTCP Approved Layout
- ఖమ్మం, వరంగల్ హైవేను ఆనుకొని
- నాగ్‌పూర్ విజయవాడ హైవేకు అతి సమీపంలో

Cell: 8985190006

Real Estate

PLOT FOR SALE

■ ఖమ్మం, వైరా రోడ్‌లో గజం 12 వేలు మరియు విల్లాలు 72 లక్షలతో లభించును. సంప్ర॥ కాట్రపల్లి నాగరాజ్, ఖమ్మం. సెల్ : 9399342239. [M-1190505]

■ సత్తుపల్లికి 12km దూరంలో లింగగూడెం గ్రామం (చింతలపూడి మండలం)లో Main Road పై 45 సెం. ఇంటి స్థలం (1 BHK) అమ్మకానికి కలదు. సంప్రదించండి: 9652535988 [HA-89754]

FLAT FOR SALE

■ ఖమ్మం, వర్తశాల ఎదురుగా, వైరా రోడ్ సమీపంలో న్యూ ఇరా స్కూల్ ప్రక్కన నిర్మించిన రెయిన్‌బో తులసి ఎలైట్ అపార్ట్‌మెంట్ నందు రెడీటు ఆక్యుపై 2 BHK ఫ్లాట్స్ అమ్మబడును. సంప్ర. 7799830620. [M-1190502]

HOUSE FOR SALE

■ ఖమ్మం, మామిళ్ళగూడెంలో 350 చ॥గ॥ స్థలంలో 4 పోర్షన్లు (గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్) అన్ని సౌకర్యములు గల ఇల్లు అమ్మకానికి కలదు. సంప్ర. 76809 29744, 80082 50413 [M-1203198]

■ ఖమ్మం సిటి నందు నరసింహస్వామి గుట్ట దగ్గర 106 గజాలు స్థలం కలిగిన నాలుగు గదుల రేకుల ఇల్లు అమ్మబడును. విలువ 35 లక్షలు. శ్రీనివాసాచార్యులు గారు. ఫోన్ : 8074559093. [HA-10013]

Services

LOANS

■ బాలాజీ కన్సల్టెంట్: (IT రిటర్న్స్, GST, పాన్‌కార్డ్స్) చేయబడును. బిజినెస్‌లోన్స్, మార్టిగేజ్, పర్సనల్ లోన్స్ ఇప్పించబడును. శ్రీనివాస థియేటర్ దగ్గర, ఖమ్మం. సంప్ర॥ 85228 25358, 97014 32393. [M-1190553]

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్. ✆ 76508 91999 [B-786661]

ఆయుర్వేదాలయం

■ అన్ని రకముల మందులు, కీళ్ల నొప్పులు, ఉబ్బసం, చర్మ వ్యాధులు, పైల్స్, మధుమేహం, సెక్స్ సమస్యల ప్రభావవంతమైన ఫలితం, వాజీకరణం. డా॥ అశోక్ త్రిపాఠి-సెల్: 77388 97455. [K-1141937]

BUSINESS OFFER

■ We Super Stockist of FMCG Products of Masalas & Deserts is looking for District wise Distributors in TS & AP. www.mleps.in Cont: 70329 43367 [Y-748948]

Wanted

■ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లైఫ్ ఇన్సూరెన్స్‌లో పనిచేయుటకు స్త్రీ / పు Qulification Inter, 35 సం॥ పైబడిన వారు & RTD Emp అడ్వైజర్లుగా కావలెను. Contact No. 9000101631. [M-8634]

■ ఖమ్మంలో ప్రముఖ సంస్థలో పని చేయుటకు తెలుగు మరియు ఇంగ్లీష్ టైప్ అనుభవం కలిగిన లేడీ రిసెప్షనిస్ట్ వెంటనే కావలెను. సంప్ర సెల్ : 84998 88866. [M-1190506]

■ ఖమ్మం పరిసర ప్రాంతాలలో అనుభవం కలిగిన ఫీల్డ్ ఆఫీసర్ మరియు సెక్యూరిటీ స్త్రీ/పు కావలెను. డ్యూటీ : 12 గం॥లు, జీతం: 10 వేలు, వ: 50 సం॥ లోపు. 9652832478, 7036191924. [M-1190503]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారాని 83500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 9573633520, 9059633520 [M-1190557]

■ విజయవాడలో A/c & Coolers రెంటల్ (towerac.com) కంపెనీకి A/c టెక్నీషియన్స్-3, దోస్త్ డ్రైవర్-3, హెల్పర్లు-5, జీతం: 18-25,000 ట్రైనింగ్/భోజనం/వసతి ఫ్రీ ✆ 90300 44646. [B-1226251]

■ శ్రీమంతుల ఇళ్లల్లో ఇంటిపని, వంటపని, పిల్లలను, పెద్దలను, పేషెంట్స్‌ని చూసుకోవడానికి స్త్రీలు / పురుషులు కావలెను. జీ. 18,000/-. సంప్ర: 8885347730 / 8367645952 [H-792813]

■ ఇంటి దగ్గర ఉంటూ మా ఇన్వెస్ట్‌మెంట్ బిజినెస్‌కి సంబంధించిన కాల్స్ మాట్లాడటానికి ఫీమేల్ స్టాఫ్ అ॥ కా॥ను. కమీషన్+బోనస్+జీతం, ఇంట్రెస్టెడ్‌గా ఉన్నవారు డిటెయిల్స్ వాట్సాప్ చేయగలరు - 6281158171 [HA-28284]

■ పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376. [H-792805]

■ షిర్డీ సాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీ వార్డెన్స్, లేడీ సూపర్ వైజర్స్, నర్సులు, ఆయాలు, భార్యాభర్తలు కావలెను. Ph: 9391036931, 9246585901 [HA-10046]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-776049]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం జీ: 18K ఏజెంట్ కమీషన్ 3K. Ph: 7569955551/ 9848571888 [H-786823]

■ NRI తల్లిదండ్రులను, వృద్ధులను వారి ఇంటి వద్దనే ఉండి చూసుకొనుటకు, ఆయాలు, కేర్‌టేకర్స్ M/F హెల్పర్లు కావలెను. Salary 14-20K వసతి + భోజనం కలదు. ✆ 91608 35559, 78158 35561 [B-782]

■ ఖమ్మం సిటీలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, హౌస్‌కీపింగ్, ఫీల్డ్ ఆఫీసర్స్ & మార్కెటింగ్ మేనేజర్లు కావలెను. సంప్ర॥ 9069234678 [Y-772731]

■ Wanted young Lady Teachers only Pre-Nursery to 5th Class (Fluency English must) మరియు ఆయాలు కావలెను. గాంధీచౌక్, ఖమ్మం. సంప్ర॥ 99327 78297, 91005 40892. [M-1190558]

■ అంజన్న హోంకేర్ పెద్దవారికి పేషెంట్ కేర్/ఇంటి/వంటపని చేయుటకు ఆయాలు, వార్డ్‌బాయ్స్, Exp. స్త్రీ/పు/నర్సులు కావలెను. జీతం: 18,000/- నుండి 25,000/- వరకు ఇవ్వబడును. కూకట్‌పల్లిలో Hyd. Ph: 9966568882, 9963489661 [HA-900]

■ నిరుద్యోగులకు శుభవార్త! Hyd ఓల్డేజ్ హోమ్ & హోమ్‌కేర్ నందు పనిచేయుటకు యువతీ/యువకులు కావలెను. వ: 18 to 40 yrs, M/F, 10th - డిగ్రీ Pass / Fail తీసుకోబడును. ANM/GNM/నర్సులు కావలెను. M/F ఉచిత శిక్షణ, వసతి భోజనం. జీతం: 18K to 36K. Ph: 9515750369 / 9160960943 [H-776391]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రకటన గోరంత! స్పందన కొండంత!!
సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి

వివరాలకు :

ఖమ్మం	9705444182
	9010299957
కొత్తగూడెం	9010223783
పాల్వంచ	9705444183
భద్రాచలం	9951602914